క్లుప్తంగా

అసమానతలు లేని సమాజమే లక్ష్యం



మాట్లాడుతున్న శోభన్‌బాబు

మెదక్‌జోన్: అవినీతి రహిత, ఆర్థిక అసమానతలు లేని రాష్ట్రం కావాలనే తాపత్రయంతో జైభారత్ నేషనల్ పార్టీ ఆవిర్భవించిందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు శోభన్‌బాబు పేర్కొన్నారు. శనివారం ఆయన పట్టణంలోని టీఎన్‌జీవో భవన్‌లో మాట్లాడుతూ.. సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ నేతృత్వంలో జైభారత్ నేషనల్ పార్టీ తెలంగాణలో ఆవిర్భవించిందన్నారు. వచ్చేలోక్ సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని మూడు స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు చెప్పారు. మెదక్ పార్లమెంట్ నుంచి తాను పోటీ చేస్తునట్లు తెలిపారు. తనను ఎంపీగా గెలిపిస్తే ప్రతీ మండలానికి ఒక గ్లోబల్ స్టాండర్డ్ లైబ్రరీ, స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ బాధ్యులు వీరబాబు, సాయి ఉన్నారు.

పాఠశాలలో అంబేడ్కర్ జయంత్యుత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న పులిగుట్ట తండా విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పులిగుట్ట తండా ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తు అంబేడ్కర్ జయంత్యుత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రజిత విద్యార్థులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. విద్యార్థులకు అంబేడ్కర్ గొప్పదనం గురించి వివరించి ప్రతీ విద్యార్థి బాగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు గీతాంజలి, విద్యార్థులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు

కొల్చారం(నర్సాపూర్): విధుల్లో ఉన్న టాస్క్‌ఫోర్స్ పోలీసులను అడ్డుకున్న వివాదంలో నాయిని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తారా సింగ్ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే శుక్రవారం రాత్రి నాయిని జలాల్‌పూర్ శివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో టాస్క్ ఫోర్స్ సీఐ తిరుమలేశ్ తన సిబ్బందితో నాయిని జలాల్‌పూర్‌కు వెళ్లారు. రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న గ్రామానికి చెందిన రాజు, నవీన్‌ను పోలీసులు ఆపే ప్రయత్నం చేశారు. దీంతో తమ విధులకు ఆటంకం కలిగించిన రాజు, నవీన్‌లపై టాస్క్ ఫోర్స్ సీఐ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్రమ ఇసుక తరలిస్తూ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తారాసింగ్ తెలిపారు.

తేలికపాటి వర్షం



సంగాయిపేట వద్ద వర్షానికి తడిసిన ధాన్యం

కొల్చారం(నర్సాపూర్): మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు తేలికపాటి వర్షం కురవడంతో వాతావరణ పూర్తి చల్లదనంగా మారింది. ఇదే సమయంలో కల్లాల వద్ద పోసిన వరి ధాన్యం కుప్పలు వర్షపు నీటితో తడిశాయి. వర్షపు నీటతో ధాన్యం తడవకుండా ఉండేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. వర్షం తగ్గు ముఖం పట్టడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

ఫైనాన్స్ పేరుతో మోసగిస్తే చర్యలు: ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట(మెదక్): మండలంలో ఫైనాన్స్‌ల పేరిట అమాయక ప్రజలను మోసం చేస్తే చర్యలు తప్పవని శనివారం ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఫైనాన్స్‌ల పేరుతో వ్యాపారులు అమాయక ప్రజలను మోసం చేస్తూ అధిక వడ్డీ కోసం డబ్బులను అప్పుగా ఇచ్చి మోసం చేస్తున్నారన్నారు. ప్రజలను మోసగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మండలంలో అనుమతులు లేకుండా కొందరు వడ్డీ వ్యాపారం చేస్తున్నారని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా వడ్డీ రూపంలో ప్రజలను మోసగించినట్లు తెలిస్తే.. సంబంధిత పోలీస్ శాఖకు సమాచారం అందిస్తే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు

- ఒక్కో నర్సరీకి చలవ పందిరి
- రూ. 6 నుంచి 10 వేల నిధులు కేటాయింపు
- 34 పంచాయతీల్లో 5 లక్షల 10 వేల మొక్కలు



నర్సరీకి ఏర్పాటు చేసిన గ్రీన్ మ్యాట్

నర్సాపూర్ రూరల్: పల్లెల్లో పచ్చదనం పెంపొందించేందుకు గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు పెంచుతోంది. పండ్ల మొక్కలతో పాటు ఆయా రకాల మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపడుతోంది. మండలంలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో నర్సరీలు ఏర్పాటు చేసి, వివిధ రకాల మొక్కలు పెంచుతున్నారు. అవి ఎండిపోకుండా వేసవిని దృష్టిలో పెట్టుకొని చర్యలు చేపడుతున్నారు. నర్సరీల్లో మొక్కలపై చలువ పందిళ్లను (గ్రీన్ మ్యాట్స్) రక్షణ కోసం వేయిస్తున్నారు. చలువ పందిళ్ల కోసం మొక్కల సంఖ్యకు అనుగుణంగా ఒక్కో నర్సరీకి రూ.6 వేల నుంచి రూ.10వేల నిధులు కేటాయించింది.

మొక్కల సంరక్షణకు..

నర్సరీల్లో మొక్కల సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ప్రతీ నర్సరీలో జీవామృతం తయారు చేయిస్తున్నారు. మొక్కలు చనిపోకుండా ఆరోగ్యంగా ఉండేందుకు సేంద్రియ ఎరువులను వినియోగిస్తున్నారు. ఎండ తీవ్రత కోసం నర్సరీల పైభాగాన చలువ పందిళ్లు వేయించారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలు వాడిపోకుండా నీళ్లను పట్టిస్తున్నారు.

హరిత మండల దిశగా..

వర్షాలు సమృద్ధిగా కురవాలని, వాతావరణ సమతుల్యత కాపాడేందుకు, పల్లెలు పచ్చదనంతో ఉండాలన్న లక్ష్యంతో హరితహారానికి శ్రీకారం చుట్టారు. మండలంలో ఏర్పాటు చేసిన 34 నర్సరీల్లో 5 లక్షల 10 వేల మొక్కలను పెంచుతున్నారు. పదో విడత హరితహారంలో రూ.5 లక్షల 10 వేల మొక్కలు నాటే లక్ష్యాన్ని అధికారులు నిర్దేశించారు. అందులో భాగంగా పండ్లు, పూలు, నీడనిచ్చే తదితర మొక్కలను పెంచుతున్నారు. జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, ఖర్జూర, అల్లనేరేడు, నేరేడు, వెలగ, చెర్ ఉసిరి పండ్ల, గులాబీ, కరివేపాకు, మందారం, రాగి, వేప, రేన్ ట్రీ, అబూబియా, టేకొమా, గన్నేరు, మద్ది, కానుగా, మునుగా, కష్ణ తులసి తోపాటు 70 రకాలుగా పైగా మొక్కలు పెంచి అవి ఎండిపోకుండా చలువ పందిరి(గ్రీన్ మ్యాట్స్) ఏర్పాటుచేసి రక్షణ చర్యలు చేపడుతున్నారు.

> **చర్యలు చేపట్టాం**
>
> 
>
> వేసవి దృష్ట్యా ఎండిపోకుండా గ్రీన్ మ్యాట్స్ ఏర్పాటు చేయించాం. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం. ప్రతీ ఒక్కరు వచ్చే హరితహారంలో మొక్కలు నాటి సంరక్షించాలి.
>
> – మధులత, ఎంపీడీఓ నర్సాపూర్

ప్రగతి ధర్మారంలో ఆధ్యాత్మిక శోభ



దేవతా విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



యజ్ఞం చేస్తున్న పండితులు

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. గ్రామ శివారులోని రఘుపతిగుట్టపై ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారామచంద్ర స్వామి విగ్రహాల ప్రతిష్ఠోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా శనివారం నుంచి ఈనెల 18 వరకు ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో దేవతా విగ్రహాలను ఊరేగించారు. ఉదయం గణపతి పూజ, స్వస్తివాచనం, అఖండ దీపారాధన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, మండప పూజలు, దేవతాహ్వానం పూజలు చేశారు. సాయంత్రం విగ్రహాల ఊరేగింపు అగ్నిప్రతిష్ఠ, గణపతి హోమం నిర్వహించారు. 14న ఆధివాసాలు, హోమం 15న యంత్రస్థాపన, 16న శాంతి కల్యాణం, 17న శ్రీరామ కల్యాణం, 18న బండ్ల ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యపరీక్షలు



దేవులపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు వైద్యసిబ్బంది చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. శనివారం మండలంలోని దేవులపల్లి, కొట్టాల, పాంపల్లి, ముట్రాజ్‌పల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏఎన్ఎంలు లబ్ధిదారులకు వైద్యచికిత్సలు చేశారు. అవసరం ఉన్నవారికి రోగనిరోధక టీకాలు వేశారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. రక్తహీనతను నివారించేందుకు ఆకుకూరలు, పాలు, కోడిగుడ్లు ఆహారంలో తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రమేశ్, అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరీ, అనురాధ, రాణి, నాగరాణి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

16న కేసీఆర్ సభకు తరలిరండి



రామోజిపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

పెద్దశంకరంపేట(మెదక్): బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 16న సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్ టోల్‌ప్లాజా వద్ద మాజీ సీఎం కేసీఆర్ హాజరయ్యే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ జంగం శ్రీనివాస్, జెడ్పీటీసీ విజయరామరాజు అన్నారు. శనివారం పెద్దశంకరంపేట మండలంలోని ఉత్తులూర్, రామోజీపల్లి తదితర గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మాజీ మండలాధ్యక్షుడు సురేశ్ గౌడ్, నాయకులు ఉప్పరి సాయిలు, యాకుబ్, శంకర్‌గౌడ్, దుర్గయ్య తదితరులున్నారు.

బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరుతున్న ఆరేపల్లి యువకులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో శనివారం పార్టీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆరేపల్లి యువకులు పార్టీలో చేరగా, వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించి జహీరాబాద్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ గెలుపుకు కృషి చేయాలని వారికి సూచించారు. పార్టీలో చేరిన వారిలో అనిల్‌రావు, పర్వయ్య, దేవయ్య, లక్ష్మణ్, దత్తు, శివకుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత



వెల్దుర్తి పోలీసులు పట్టుకున్న అక్రమ మద్యం

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని రామాయిపల్లి గ్రామంలో కాలె సంతోష్ కిరాణ దుకాణంలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచారనే పక్కా సమాచారంతో ఎస్ఐ నవతగౌడ్ ఆధ్వర్యంలో తన సిబ్బందితో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన రూ.14,780 విలువజేసే 24.4 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని దుకాణ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో అక్రమ మద్యం నిల్వచేసినా, బెల్టు దుకాణాలు నిర్వహించినా తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని, అటువంటి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లాయక్, కానిస్టేబుల్స్ మహేశ్, కృష్ణాగౌడ్, మాణిక్యం పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆలయానికి మైక్‌సెట్ అందజేత

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామ శివారులోని లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం అభివృద్ధి కోసం దాతలు ముందుకు వస్తున్నారు. గ్రామానికి చెందిన రెడ్డి లింగయ్య, రెడ్డి లచ్చయ్యల స్మారకార్థం హైదరాబాద్‌లో స్థిరపడిన వారి కుమారులు రూ.35 వేలు విలువజేసే మైక్ సెట్‌ను శనివారం ఆలయానికి అప్పగించారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల బీఆర్ఎస్ కార్యకర్తలు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, సీనియర్ నాయకులు నవీన్‌గుప్తా కండువాలు వేసి ఆహ్వానించారు.

◆ మండలంలో 38.6 ఎం.ఎంల వర్షపాతం నమోదు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో 38.6 ఎం.ఎంల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. కొన్ని రోజులుగా ఎండ వేడిమికి ఇబ్బందులు పడిన ప్రజలకు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. ఈ వర్షాలకు రహదారులన్నీ చిత్తడిగా మారాయి.

◆ చికిత్స పొందుతూ మహిళ మృతి

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ తారసింగ్ తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రం కొల్చారంకు చెందిన పర్వీన్ బేగం(50) శుక్రవారం రాత్రి అప్పాజిపల్లి గ్రామానికి వెళ్తుండగా మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారిపై గుర్తులేని వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడ్డ ఆమెను చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తుండగా మృతి చెందిందన్నారు. మృతురాలి భర్త సయ్యద్ పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

◆ డ్యూయల్ డెస్క్‌ల బహూకరణ



చేగుంట(తూప్రాన్): మండలంలోని వల్లభాపూర్ ప్రాథమిక పాఠశాలకు స్థానిక సుప్రసన్న సోలార్ ఎనర్జీ నిర్వాహకులు డ్యూయల్ డెస్క్ బెంచీలను బహూకరించారు. తరగతి గదికి పేయింటింగ్‌తో పాటు హ్యాండ్‌వాష్ యూనిట్‌ను నిర్మించారు. డిప్యూటీ మేనేజర్ సత్యశీలన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తమ వంతు సహకారంగా మెరుగైన పాఠశాలలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పరమేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయురాలు సమత, అంగన్‌వాడీ కార్యకర్త శోభరాణి ఉన్నారు.

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా భాస్కర్



కౌడిపల్లి(నర్సాపూర్): బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని తునికి గ్రామానికి చెందిన సంద్రుగు భాస్కర్‌ను నియమించినట్లు బీజేపీ మండలాధ్యక్షుడు రాకేష్ తెలిపారు. శనివారం ఆయన కౌడిపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని భాస్కర్ తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

వెల్దుర్తి(తూప్రాన్): పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా దేవాలయంలో శ్రీదేవీ, భూదేవీ సహిత వేంకటేశ్వరస్వామి, శివ పార్వతుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవదేవుడి కల్యాణ మహోత్సవాన్ని భక్తులు ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు. మహిళలు ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. వేంకటేశ్వరస్వామి, శివపార్వతులు, నవగ్రహాలకు పంచామృత అభిషేకములతో పాటు ఆంజనేయస్వామికి సింధూర పూజ నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు గిరీశ్వరశర్మ పేర్కొన్నారు. అదే విధంగా లోక కల్యాణార్థమై వేద పండితుల మంత్రోచ్ఛరణలతో హోమం నిర్వహించామన్నారు. వేడుకల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ తరఫున అతిథులను శాలువాతో సత్కరించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, కృష్ణాగౌడ్, అశోక్‌గౌడ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కూచన్‌పల్లిలో..

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని కూచన్‌పల్లి కూచాద్రి వేంకటేశ్వర కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు శనివారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన కల్యాణాన్ని చూడడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో హవేళిఘణాపూర్ ఎంపీపీ శేరి నారాయణరెడ్డి దంపతులతో పాటు మెదక్, హవేళిఘణాపూర్, మెదక్ పట్టణం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు ప్రాముఖ్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాబృందం

వెల్దుర్తి(తూప్రాన్): జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రం వెల్దుర్తిలో ఓటుహక్కు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటుహక్కు ఉన్న ప్రతీ ఒక్కరూ ఓటేయాలంటూ తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం పాటలు పాడారు. ప్రతీ ఒక్కరూ నిష్పక్షపాతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని, ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటువేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీం లీడర్ సిద్దు, సభ్యులు రామారావు, ఎల్లం, దాసు, శేఖర్, విజయలక్ష్మి, మాధవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని కాపాడుకోవాలి



యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న యూనియన్ సభ్యులు

నర్సాపూర్: ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు కృషి చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. శనివారం యూటీఎఫ్ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంఆర్సీ భవనం ఎదుట యూనియన్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ, అనే అంశాలతో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాజీలేని పోరాటం చేస్తుందని శ్రీనివాస్‌రావు అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చానాయక్, మండల శాఖ అధ్యక్షుడు రవి, ఇతర ప్రతినిధులు డాకియా, కనకరాజు, రమేశ్, రాజు, గంగాధర్, అప్పలనాయుడు, కేవీఆర్ నాయుడు, రవి, పెంటయ్య, రాజు, శంకరాచారి, సత్యానారాయణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ముత్యాలమ్మ ఉత్సవాలు




చిలప్‌చెడ్(నర్సాపూర్): జగ్గంపేటలో నల్లపోచమ్మకు బోనాలు తీస్తున్న మహిళలు



సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు శనివారం కనుల పండువగా జరిగాయి. తెల్లవారుజామున గ్రామానికి చెందిన భక్తులు సమీపంలోని మంజీరా నదీ జలాలను తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం అలంకరణ, రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి వారితో పూజా కార్యక్రమాలను పురోహితులు ప్రారంభించారు. అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగింది. సాయంత్రం అమ్మవారికి బోనాల ఊరేగించారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని జగ్గంపేట గ్రామంలోని నల్లపోచమ్మకు మహిళలు శనివారం ఘనంగా బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ మహిళలు బోనాల ఊరేగింపు డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, చిన్నారులు, యువకులు నృత్యాలతో ఆకట్టుకుంది. అనంతరం ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, ప్రదక్షిణలతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



కొల్చారం(నర్సాపూర్): బోనాల ఊరేగింపు

చెక్ పోస్టువద్ద నగదు పట్టివేత



కాళ్లకల్ వద్ద పట్టుకున్న నగదుకు రశీదును అందిస్తున్న ఎస్ఐ



కోఠాపల్లి టోల్‌ప్లాజా వద్ద నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు

మనోహరాబాద్(తూప్రాన్): సరైనా పత్రాలు లేకుండా నగదుతో ప్రయాణిస్తున్న వ్యక్తుల వద్ద నుంచి రూ 2. 65 వేల నగదుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌కు చెందిన సాగర్ సూర్య వంశీ రూ. లక్ష, హరినాథ్ చారి రూ. లక్ష, ఉప్పల్‌కు చెందిన భిక్షపతి జన రూ. 65 వేల డబ్బుతో తమ కారుల్లో ప్రయాణిస్తుండగా కాళ్లకల్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. దీంతో పోలీసులకు లభించిన డబ్బుకు ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి, సిద్దిపేట్ ఎన్నికల అధికారి కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజలు ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కోఠాపల్లి 161వ జాతీయ రహదారిపై పాత టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఎలాంటి ధృవపత్రాలు లేకుండా రూ.4 లక్షల 50 వేల నగదు తీసుకెళ్తున్న పి.వీరయ్య నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ నగదును సంగారెడ్డి జిల్లా గ్రీవెన్స్ కమిటీలో డిపాజిట్ చేస్తామన్నారు. ప్రజలు రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్లవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శంకర్, ఏఎస్ఐ సునీత పాల్గొన్నారు.